క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గోపాలపురం: మండలంలోని గుడ్డిగూడెం రోడ్డులో ఉన్న కనకదుర్గమ్మ ఆలయం వద్ద బల్లపై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై కర్రి సతీష్‌కుమార్ గురువారం తెలిపారు. అతని వయస్సు 45 నుంచి 50 ఏళ్లు ఉంటాయని చెప్పారు. అతను కొయ్యలగూడెం మండలం బోడిగూడెం వాసిగా గుర్తించినట్లు తెలిపారు. అతని వివరాలు **తెలిసిన వారు** గోపాలపురం ఎస్సై 94407 **96665 నంబరుకు** సమాచారం ఇవ్వాలని కో**రారు.**

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతి చెందిన నరేష్‌కుమార్

పెరవలి: జాతీయ రహదారిపై ఖండవల్లి వద్ద గత నెల 22న కారు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన బండారు నరేష్‌కుమార్(60) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు **వివరాల మేరకు,** రాజమండ్రికి చెందిన **నరేష్‌కుమార్ గత** నెలలో కారు ఢీకొట్టిన ఘటన**లో** కాలు, చేయి విరిగి తీవ్రంగా గాయపడడంతో తణుకు ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడు రాజమండ్రిలోని రాజేంద్రనగర్, నాలుగో వార్డుకు చెందిన వ్యక్తి అని, మృతుని వివరాలు తెలిసిన వారు పెరవలి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

బాధితురాలికి మానవత ఆర్థిక సాయం



బాధితురాలికి ఆర్థిక సాయం అందిస్తున్న సభ్యులు

నల్లజర్ల: దూబచర్ల గ్రామంలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న వై.రాజ్‌బీకి మండల మానవత సంస్థ గురువారం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేసింది. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు భోగవల్లి వెంకటసుబ్బారావు, గుళ్లపూడి వెంకటరత్నం, గుత్తికొండ వరప్రసాద్, పాతూరి సత్యనారాయణ, ఉన్నమట్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధుల ఆశ్రమంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న శ్రీరామ్మూర్తి

దేవరపల్లి: జైకిషాన్ వృద్ధుల ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, వైఎస్సార్ సీపీ జిల్లా నాయకుడు వెలగా శ్రీరామూర్తి దుప్పట్లు పంపిణీ చేశారు. శ్రీరామూర్తి, ప్రమీలాకుమారి దంపతుల కుమారుడు జ్యోతిషన్ముఖఆకాష్ పుట్టిన రోజును గురువారం ఆశ్రమంలో నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధులకు భోజన సదుపాయం ఏర్పాటు చేసి, 20 మంది వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు డి.భీమరాజు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: సాంకేతిక కారణాల రీత్యా దేవరపల్లి సబ్‌స్టేషన్‌లో శుక్రవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. 11 కేవీ టౌన్, ఇండస్ట్రియల్, బందపురం, అచ్చయపాలెం ఫీడర్లకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు చెప్పారు. వ్యవసాయ మోటార్లకు ఉదయం 4 నుంచి 7 వరకు, మధ్యాహ్నం ఒకటి నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్ ఉంటుందని తెలిపారు.

కొవ్వూరు: దొమ్మేరు సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుంది. వార్షిక మరమ్మతుల్లో భాగంగా దొమ్మేరు లోకల్, 11 కేవీ దొమ్మేరు సావరం, 11 కేవీ కాపవరం ఫీడర్లకు సరఫరా నిలిపివేస్తారు. ఈ కారణంగా కాపవరం, దొమ్మేరు, పెనకనమెట్ట, దొమ్మేరు సావరం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదు.

నిడదవోలు రూరల్: మండలంలోని కాటకోటేశ్వరం, బసివిరెడ్డిపేట సబ్‌స్టేషన్ పరిధిలోని సూరాపురం, తాళ్లపాలెం, శెట్టిపేట గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు నారాయణ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

చాగల్లు: సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో శుక్ర, శనివారాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు చాగల్లు, నెలటూరు, మీనానగరం తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదు.



భారీ వాహనాల నియంత్రణకు పెట్టిన గడ్డర్లు తొలగించాక సమిశ్రగూడెం వంతెన



2018లో కుప్పకూలిన నిడదవోలు ఐరన్ బ్రిడ్జి (ఫైల్)

వణికిస్తున్న వంతెన

- కూలడానికి సిద్ధంగా సమిశ్రగూడెం వారధి
- ట్రాఫిక్ నియంత్రణకు ఏర్పాటు చేసిన గడ్డర్ల తొలగింపు
- యథేచ్ఛగా భారీ వాహనాల రాకపోకలు
- నిడదవోలు వంతెన కూలిన ఘటన నుంచి నేర్వని గుణపాఠం



పట్టణంలో పాత ఆర్వోబీ వద్ద ఒకవైపు తొలగించిన గడ్డర్



సమిశ్రగూడెం పురాతన వంతెనలో తుప్పపట్టిన ఐరన్

నిడదవోలు: పురాతనమైన సమిశ్రగూడెం వంతెనపై భారీ వాహనాల రాకపోకల యథేచ్ఛగా సాగుతున్నాయి. గతంలో నిడదవోలు పట్టణంలో అప్పారావు కాలువపై చినకాశిరేవు వద్ద ఉన్న పురాతన వంతెన కూలినా.. అధికారులు కళ్లు తెరవడం లేదు. భారీ ముప్పు పొంచి ఉన్నా, శిథిలావస్థలో ఉన్న వంతెన పరిరక్షణకు చర్యలు చేపట్టడం లేదు. గతంలో కూలిన నిడదవోలు వంతెనకు కూతవేటు దూరంలో ఉన్న సమిశ్రగూడెం వంతెన చూస్తే ఈ విషయం అవగతమవుతుంది. ఈ వంతెనపై రాకపోకలకు ప్రస్తుతం ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

92 ఏళ్ల చరిత్ర

సమిశ్రగూడెం గ్రామంలో పశ్చిమ డెల్టా ప్రధాన కాలుపై బ్రిటిష్ హయాంలో 1932లో నిర్మించిన ఐరన్ గడ్డర్ బ్రిడ్జి ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. ఈ వంతెన 50 మీటర్ల పొడవు, 6 మీటర్ల వెడల్పు ఉంది. గతంలో దీని శ్లాబ్ పనులు మాత్రమే చేపట్టారు. ప్రస్తుతం వంతెన ఐరన్ గడ్డర్లు తుప్పు పట్టాయి. వంతెన కింద భాగంలో గడ్డర్లు తుప్పుపట్టాయి. గడ్డర్లు పట్టు వదిలి ఒక్కొక్కటిగా కాలువలోకి వేలాడుతున్నాయి. దీని కాల పరిమితి దాటిపోవడంతో కేవలం 10 టన్నుల వాహనాలను మాత్రమే అనుమతిస్తున్నారు. ఏ క్షణంలోనైనా కూలిపోయే పరిస్థితి నెలకొంది.

పట్టని నిబంధనలు

ఇంతటి భయానక పరిస్థితి ఉన్నా ఆర్‌అండ్‌బీ, పోలీస్ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం ఈ వంతెనపై 10 టన్నులకు మించిన లోడు వాహనాలు ప్రయాణించరాదు. ప్రస్తుతం రాత్రి సమయంలో 50 నుంచి 80 టన్నుల వాహనాలు సైతం ప్రయాణిస్తున్నాయి. అయినా అధికారులు కన్నెత్తి చూడడం లేదు. వంతెనకు ఒకవైపు 10 టన్నుల లోపు వాహనాలు మాత్రమే వెళ్లాలని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకొన్నారు. ఇసుక, క్వారీ లారీలతో పాటు, కోళ్ల పరిశ్రమ, వ్యవసాయ ఉత్పత్తుల భారీ లోడు వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ఈ వంతెనపై రెండు వాహనాలు ఒకేసారి రావడానికి వీలుండదు. అయినా చాలా సందర్భాల్లో రెండు వాహనాలు ఒకేసారి రావడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. దీంతో పోలీసులకు తలనొప్పిగా మారింది. ఒక్కోసారి వంతెనపై భారీ వాహనాలు నిలిచిపోయి 200 టన్నుల భారం పడుతుంది. ఇలాంటి సందర్భాల్లో వంతెన కూలిపోయే ప్రమాదం లేకపోలేదు. వంతెనకు రెయిలింగ్ కూడా లేకపోవడంతో కాలువలోకి వాహనాలు దూసుకుపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి.

గడ్డర్ల తొలగింపు

సమిశ్రగూడెం పురాతన వంతెనపై భారీ వాహనాల నియంత్రణకు గత ప్రభుత్వంలో ఐరన్ గడ్డర్లను ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వంలో ఇసుక అక్రమ రవాణా కోసం ఈ గడ్డర్లను తొలగించి, యథేచ్ఛగా ఇసుకను తోలుకుంటున్నారు. ఇలాగే నిడదవోలు పట్టణంలో పాత ఆర్వోబీ ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన గడ్డర్లనూ ఒకవైపు తొలగించడంతో, భారీ వాహనాలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ప్రస్తుతం నూతన ఆర్వోబీ నిర్మాణ పనులు జరుగుతుండడంతో, ఆర్‌ఆర్‌ఆర్ సంస్థకు సంబంధించిన వాహనాల రాకపోకలకు ఆర్వోబీ అధికారులు అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. సందిట్లో సడేమియా అన్నట్టుగా ఇసుక అక్రమ రవాణా వాహనాలు కూడా వెళుతున్నాయి. దీంతో సమిశ్రగూడెం వంతెన ఏ క్షణాన కూలుతోందోనని ప్రజలు, ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. ఇసుక, క్వారీ లారీలు సంచరిస్తున్నా పోలీసు, ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

ఉభయ గోదావరి జిల్లాలకు..

ఈ వంతెన ఉభయ గోదావరి జిల్లాల మధ్య రాకపోకలకు ప్రధాన మార్గంగా ఉంది. తాడేపల్లిగూడెం, నిడదవోలు, పంగిడి, దేవరపల్లి, నుంచి రాజమండ్రి, నరసాపురం ధవళేశ్వరం, రావులపాలెం మీదుగా వెళ్లాలంటే ఈ వంతెన దగ్గర దారి. అందుకే ఎక్కువ మంది వాహనదారులు, ప్రయాణికులు ఈ మార్గాన్ని ఎంచుకుంటారు. నిత్యం వంతెన పైనుంచి సుమారు ఐదు వేల వాహనాలు ప్రయాణిస్తున్నాయి. కీలకమైన ఈ వంతెన శిథిలావస్థకు చేరినా అధికారులకు పట్టడం లేదు. ఆరేళ్ల క్రితం కూలిన నిడదవోలు బ్రిడ్జి ఘటన నుంచి గుణ**పాఠం నేర్చుకోకుండా,** భారీ వాహనాల రాక**పోకలను విస్మరిస్తున్నారు.** రాత్రి సమయాల్లో **ఇసుక, క్వారీ లారీలు** తిరుగుతున్నాయి. **మామూళ్ల మత్తుకు** అలవాటు పడ్డ పోలీస్, **ఆర్‌అండ్‌బీ అధికారులు** ఈ వ్యవహారంపై **చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని** ప్రయాణి**కులు ఆరోపిస్తున్నారు.** వంతెనపై భారీ **వాహనాల నియంత్రణ**కు అడ్డుగా పెట్టిన ఐరన్ **గడ్డర్లను తొలగించినా** చర్యలు తీసుకోకపోవడాన్ని **ప్రజలు తప్పు** పడుతున్నారు. ఆర్‌ఆర్‌**ఆర్ సంస్థకు మాత్రమే** ఈ మినహాయింపు **ఏమిటని, వాహనాల** రాకపోకలను అధికా**రులు అనుమతించడం**పై తీవ్ర విమర్శలు **గుప్పిస్తున్నారు.**

గడ్డర్లు ఏర్పాటు చేస్తాం

సమిశ్రగూడెం వంతెన వద్ద గతంలో ఏర్పాటు చేసిన ఐరన్ గడ్డర్లు తొలగించిన మాట వాస్తవమే. వాటిని తిరిగి ఏర్పాటు చేస్తాం.పురాతన వంతెనపై 10 టన్నుల వాహనాలకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. నూతన ఆర్వోబీ నిర్మాణానికి మాత్రమే 10 టన్నుల వాహనాలను మాత్రమే అనుమతించాం. ఇసుక వాహనాలు వెళ్తే అది మాకు సంబంధం లేదు. వంతెనకు మరోవైపు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తాం.

– శ్రీనివాస విజయ్,
ఏఈ, ఆర్‌అండ్‌బీ, నిడదవోలు

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



ఉనకరమిల్లిలో రెవెన్యూ సమస్యలపై విచారణ చేస్తున్న ప్రత్యేకాధికారి



దుద్దుకూరు సదస్సులో తహసీల్దార్‌కు దరఖాస్తు ఇస్తున్న రైతులు

నిడదవోలు రూరల్: రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమణానాయక్ తెలిపారు. మండలంలోని ఉనకరమిల్లి గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలో 29 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ తెలిపారు. సదస్సులో వచ్చిన సమస్యలపై నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమణానాయక్ క్షేత్ర స్థాయిలో పర్యటించి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో డీటీ బి.ప్రదీప్‌కుమార్, ఆర్ఐ సత్యేంద్ర, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దేవరపల్లి: రెవెన్యూ సదస్సుల ద్వారా గ్రామాల్లోని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని దుద్దుకూరు గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ బొంతా నాగమణి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో 12 దరఖాస్తులు వచ్చినట్టు తహసీల్దార్ రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ సదస్సులో సొసైటీ మాజీ అధ్యక్షులు కాండ్రు రామకృష్ణ, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల కుటుంబాలకు పరామర్శ



నెలటూరులో లక్ష్మీకాంతం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తలారి వెంకట్రావు

చాగల్లు: మండలంలో ఇటీవల మృతిచెందిన వైఎస్సార్ సీపీ శ్రేణుల కుటుంబాలను కొవ్వూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు గురువారం పరామర్శించారు. నెలటూరులో మాజీ సర్పంచ్ నిమ్మగడ్డ చినరాములు తల్లి లక్ష్మీకాంతం ఇటీవల మృతిచెందారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చాగల్లులో పార్టీ నాయకుడు ముద్రగడ భగవాన్ తండ్రి ఇటీవల మృతిచెందగా, ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. దారవరంలో మృతిచెందిన మద్దిపాటి వీరన్నచౌదరి చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంపీపీ మట్టా వీరాస్వామి, పార్టీ మండలాధ్యక్షులు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, గౌరవాధ్యక్షులు జుట్టా ఏడుకొండలు, సర్పంచ్ మద్దుకూరి రవిప్రసాద్, నాయకులు గెడా శ్యామ్, జాలం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

నల్లజర్ల: సుస్థిర ప్రణాళికలు తయారు చేసి గ్రామాలను స్వర్ణ పంచాయతీలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ సింహాద్రి అన్నారు. ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సర్వేయర్లు, ఏఎన్ఎంలు, గ్రేడ్–5 కార్యదర్శులకు మూడో రోజు శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తేనే గ్రామ స్వరాజ్యం సాకారమవుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అజయ్ బాబు, ఏఓ కమల్‌రాజ్, పీఆర్ ఏఈ పవన్, ఐకేపీ ఏపీఎం శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

పెరవలి: ప్రజల భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ డి.అచ్యుతకుమారి తెలిపారు. కొత్తపల్లి అగ్రహారంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి 30 ఫిర్యాదులు అందాయి.

చాగల్లు: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. తహసీల్దార్ ఎం.మేరకమ్మ, ఎంపీడీవో ఆర్.శ్రీదేవి తదితరులు ఉన్నారు.


బదిలీ ఉద్యోగులకు ఎస్సై సన్మానం

ఉండ్రాజవరం: విధి నిర్వహణలో బదిలీలు తప్పనిసరి అని, బదిలీపై వెళ్లిన ఉద్యోగులు ప్రజల మనసును చూరగొనాలని ఎస్సై గుబ్బల శ్రీనివాసరావు అన్నారు. ఉండ్రాజవరం పోలీస్‌స్టేషన్ నుంచి కొందరు కానిస్టేబుళ్లు కొవ్వూరు, తాళ్లపూడి, పెర వలి ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. ఈ నేపథ్యంలో వారికి గురువారం శాలువాతో సన్మానించారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

నిడదవోలు: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వినియోగదారుల హక్కులు–బాధ్యతలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వినియోగదారుల పరిరక్షణ కౌన్సిల్ సభ్యులు ఎస్.వీరశంకర్ మాట్లాడుతూ, వస్తు సేవల వినియోగంలో జరిగే మోసపూరిత అంశాలపై అవగాహన కల్పించారు. మరో కౌన్సిల్ సభ్యుడు జి.అనంతరావు మాట్లాడుతూ, వినియోగదారుల పరిరక్షణ చట్టాలు, డిజిటల్ వ్యవస్థలో మార్పులు, అవకతవకలపై సమాచారం అందించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. విజిలెన్స్ కమిటీ సభ్యులు డి.వెంకటేశ్వరరావు, పట్టణ వినియోగదారుల సంఘ అధ్యక్షుడు బి.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డి.రుద్ర, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కంబయ్య పాల్గొన్నారు.

వర్గీకరణకు మద్దతుగా కమిషన్‌కు వినతి



కమిషన్‌కు వినతిపత్రం ఇస్తున్న సురేష్‌కుమార్

దేవరపల్లి: ఎస్సీ వర్గీకరణ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరుతూ కాకినాడ కలెక్టరేట్‌లో గురువారం ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రాను ఎంఆర్పీఎస్ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తాతపూడి సురేష్‌కుమార్ మాదిగ, మండల అధ్యక్షుడు కోడి సూరి మాదిగ వినతిపత్రం అందజేశారు. ఎస్సీ కులాల వర్గీకరణకు జరుగుతున్న 59 ఉప కులాలపై ఉన్న వివక్షను కమిషన్‌కు వివరించినట్టు సురేష్‌కుమార్ తెలిపారు.

పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలి

ఉండ్రాజవరం: విద్యార్థులు బాగా చదివి, పదో తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని పాఠశాల హెచ్ఎం కె.మాణిక్యాలరావు ఆకాంక్షించారు. ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను 160 మంది విద్యార్థులకు గురువారం ఉచితంగా పంపిణీ చేశారు. సుమారు రూ.15 వేల విలువైన ఈ స్టడీ మెటీరియల్‌కు ఉపాధ్యాయుడు ఇవ్వల రాంబాబు ఆర్థిక సహకారం అందించారు. ఉచితంగా స్టడీ మెటీరియల్ అందిస్తున్న రాంబాబును హెచ్ఎం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నిరీక్షణ రాజు, లక్ష్మీనారాయణ, ఉదయభాస్కర్, దుర్గాప్రసాద్, శేషేంద్ర తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉండ్రాజవరం మండల వనరుల కేంద్రం వద్ద యూటీఎఫ్ మండల శాఖ నిర్వహించిన కార్యక్రమంలో యూటీఎఫ్, ఎస్ఎస్‌సీ స్టడీ మెటీరియల్‌ను ఎంఈఓ సీహెచ్.సక్సేనారాజు ఆవిష్కరించారు. యూటీఎఫ్ ప్రతినిధులు ఐ.రాంబాబు, ఎస్.లక్ష్మీనారాయణ, వైవీ స్వామి, ఎస్.తాతారెడ్డి, బి.రామారావు, ఆర్.ఫణి, పి.వీరాంజనేయులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమైతే ప్రగతి సాధ్యం

పెరవలి: పంచాయతీలు ప్రగతి పథంలో పయనించాలంటే ప్రణాళికతో పాటు, ప్రజలతో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని డీఆర్‌డీపీ ఏపీఎం బి రామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ, సచివాలయ సిబ్బందికి రెండు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి 9 సూత్రాలను అధికారులు పాటించాలన్నారు. గ్రామాల్లో ముఖ్యంగా పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, ప్రజారోగ్యం, విద్య, వసతి సక్రమంగా ఉండాలని విశదీకరించారు. అప్పుడే ప్రజల్లో అధికారులకు గౌరవం ఏర్పడి సుస్థిరాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఎంపీపీ కార్నెర్ల ప్రసాద్ మాట్లాడుతూ, అధికారులు, ప్రజాప్రతినిధులపై గౌరవ మర్యాదలతో నడుచుకోవాలని, అప్పుడే ప్రగతికి బాటలు పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్ వెంకటరమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మండల అధికారులు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమిత్ షా చిత్రపటం దహనం

– అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసన



నిడదవోలులో అమిత్ షా చిత్రపటాన్ని దహనం చేస్తున్న నాయకులు, దళితులు



త్యాజంపూడిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న యూత్ సభ్యులు

నిడదవోలు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఎగతాళిగా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా పట్టణంలోని చర్చిపేట అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టారు. అమిత్‌షా చిత్రపటాన్ని చెప్పులతో కొడుతూ, దహనం చేశారు. అమిత్ షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు మాట్లాడుతూ, రాజ్యాంగం ద్వారా సమాజంలో నిమ్న జాతుల వారికి గౌరవ మర్యాదలు, చదువుకునే అవకాశం కల్పించిన సామాజిక విప్లవ మహనీయుడు డాక్టర్ అంబేడ్కర్‌ని అమిత్‌షా అవమానించడంతో దేశంలో కోట్లాది మంది దళితుల ఆత్మాభిమానం దెబ్బతిందన్నారు. రాజ్యాంగాన్ని నాశనం చేయాలని చూస్తున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తులను అంతమొందించటం కోసం అందరూ పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోషే, రమేష్, శేఖర్, పెద్దిరాజు, రాజేష్, రాజు, రాజేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పి, రాజీనామా చేయాలి

దేవరపల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పి, రాజీనామా చేయాలని అంబేడ్కర్ యూత్ సభ్యులు, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. త్యాజంపూడిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం వారు నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకుడు ఎస్.భగత్ మాట్లాడుతూ, పార్లమెంట్ సాక్షిగా అమిత్ షా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవహేళనగా మాట్లాడడం దారుణమన్నారు. దేశఐక్యతకు భారత రాజ్యాంగం ప్రాణం వంటిదన్నారు. రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే కుట్ర కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చాపకింద నీరులా చేస్తోందని దుయ్యబట్టారు. జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని చెప్పారు. సీపీఎం నాయకులు వారా కృష్ణారావు, అయినపర్తి శ్రీనివాసరావు, అంబేడ్కర్ యూత్ సభ్యులు మానుపాటి రామకృష్ణ, మరపట్ల రత్తయ్య, వారా సందబ్బులు, విపర్తి చంద్రరావు, యంగల చందు, కృష్ణప్రసాద్, గల్లి శ్రీను పాల్గొన్నారు.